# వింత పరీక్ష

— సుంకర భాస్కరరావు

రావ్‌నాథ్ గుప్త అనే పెద్ద పారిశ్రామికుడికి ఏకైక పుత్రుడు ప్రేమనాథ్. సంపదల్లో పుట్టినా ఆడంబరాలు గిట్టని సాదా జీవి. అనుకోకుండా ఒక పేదపిల్ల మీద ప్రేమ పుట్టింది. ఆ పిల్లపేరు వాణి. బుద్ధిమంతురాలు. జీనియస్. ఆ తెలివితేటలు ఆ మోఘం, అఖండం, అద్వితీయం, అపూర్వం అని చెప్పొచ్చు.

వాణి డిగ్రీ పూర్తి చేసి ఒక లైబ్రరీలో చిన్న ఉద్యోగం చేస్తోంది. ఆ లైబ్రరీకి తప్పకుండా ఎటెండ్ అవుతాడు ప్రేమనాథ్. పుస్తకాల మీద ప్రేమకాదు— పుస్తకాల ఉద్యోగిని మిస్ వాణి మీద ప్రేమ అందుకు కారణం.

లైబ్రరీ క్లోజ్ చేసేసారు. రెండో అంతస్తులో పిట్టగోడ దగ్గిర నిలబడ్డారు వాణి, ప్రేమనాథ్.

"అయితే మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నాని అంటున్నారు! అవునా?" గంభీరంగా అడిగింది వాణి.

"కాదని నేనంటావా? అలా అన్నది నేనేగా!" తెలివి తనకీ ఉందని చూపించే ప్రయత్నం చేసాడు ప్రేమనాథ్. ఉర్ఫ్ ప్రేమిస్తున్న ఆ యువకుడు.

'ఇది చాలా సీరియస్ విషయం!' అంది వాణి.

'ఎందుచేత?'

'మీది మంద బుద్ధి అనుకుంటాను. ప్రేమ, పెళ్ళి బ్రతుకులో సీరియస్ విషయాలు కావా?' అడిగింది వాణి.

"వాది చురుకైన బుద్ధి అని మీరు అనుకుంటుంటే కాదనే హక్కు నాకు లేదు. కాని నాది మంద బుద్ధి అని మీరు అనటానికి మీకు హక్కు వుందని మీరనుకుంటుంటే, అదెలాగు నాకు చెప్పనంతవరకూ మీ బుద్ధి మాంద్యాన్ని కప్పుకోలేరు. ఎందుకంటే— ప్రేమ, పెళ్ళి చాలా సీరియస్ విషయాలని మీరు అనుకోవటం— మీ 'మెంటల్ స్టేట్'ని బట్టి ఉంటుంది. మీరు పెరిగిన వాతావరణం మీలో నాటిన 'స్టేండర్డ్స్' బట్టి వుంటుంది. కొందరు లైఫ్‌ని తేలిగ్గా తీసుకుని, అనవసరమైన టెన్షన్స్ పడకుండా హాయిగా గడుపుతారు. అలాంటి వాళ్ళు, మీ మాటని అంగీకరించకపోతే, వాళ్ళని మంద బుద్ధులని ముద్ర వేసే ప్రయత్నం చేస్తే, అది మీ 'తెలివి తేటలు' అనిపించుకోదు! ఏమంటారు?" చిన్నపైజా ఉపన్యాసం దంచేసాడు ప్రేమనాథ్.



"బాగానే వుంది మీ వాదం. కాదనను. ఇంతకీ మీరు నన్ను ప్రేమించి ఏం చేయబోతున్నారు?"

"పెళ్ళి చేసుకుంటాను. నా ఇల్లాలుగా చేసుకుని, నా పిల్లలకి తల్లిగా చూసుకుంటాను" అన్నాడు ప్రేమనాథ్.

"పెళ్ళి చేసుకుంటున్న వాళ్ళంతా ప్రేమిస్తున్నారని ప్రేమించే పెళ్ళి చేసుకుంటున్నారని నేను అనుకోను. పెళ్ళికి ముందు ప్రేమ అవసరం లేదు. ఒకసారి పెళ్ళి చేసుకున్న తర్వాత, స్త్రీ ఒక 'మెటీరియల్ పొజెషన్' అయిపోతుంది. ఆ విధంగా సొంతం అయ్యాక, సొంత వస్తువుల

మీదుండే ప్రేమ ఎలాగూ భర్తగా మీకు ఉంటుంది. కాదంటారా?'' అడిగింది వాణి.

''ఏమి అనను'' అన్నాడు ప్రేమనాథ్.

''ఎందుకని?''

''ఎందుకంటే ఇలాంటి విషయాల మీద నాదంటూ ఒక అభిప్రాయం లేనప్పుడు ముఖ్యంగా అనుభవం 'కాదంటూ' లేనప్పుడు— ఎందుకంటే నేనింకా పెళ్ళి చేసుకోలేదు. గాబట్టి ఈ విషయంలో నేను తటస్థంగా ఉండటం న్యాయ సమ్మతం'' అన్నాడు ప్రేమనాథ్.

''బాగుంది! ఇదీ బాగుంది— సరే! పెళ్ళి చేసుకుంటారు. అందుకు నా తల్లిదండ్రులు మీకు కట్నంగా ఏమిచ్చుకోవాలి?'' అంది వాణి.

''కట్నమా? ఇన్ సల్ట్! దాని అవసరం నాకు లేదు. నేను పెద్ద బిజినెస్ మాగ్నట్ కొడుకుని! మీకు తెలీదా?'' అన్నాడు ప్రేమనాథ్.

''బిజినెస్ మాగ్నెట్ కొడుకా? అంటే వ్యాపార పరిజ్ఞానం ఉన్న కుటుంబమేనన్నమాట! మరి పెళ్ళిలో వ్యాపారం వద్దంటున్నారే! కట్నం కానీ వద్దంటున్నారే! మీరేం వ్యాపార కుటుంబీకులు?'' అంది వాణి.

''అనుమానమా? ఎంత అవమానం! నేను ఖచ్చితంగా, అసలుసిసలు వ్యాపారస్థుడి కొడుకుని!'' అన్నాడు ప్రేమనాథ్.

''అయితే ఇక్కడ నుంచి కిందకు దూకే యండి!'' అంది వాణి, మందహాసం చేస్తూ.

''అపహాస్యమా?'' అడిగాడు ప్రేమనాథ్

''లేదు. సీరియస్‌గా చెప్తున్నాను. మీరన్నదాన్ని పరీక్షించటం కోసమే అంటున్నాను. మీరు చెప్పిందే నిజమైతే, కిందికి దూకేయండి!'' అంది వాణి.

''కాళ్ళిరగవూ?'' అనుమానంగా అడిగాడు ప్రేమనాథ్.

''విరగవు!'' అంది వాణి.

''నిజంగా?'' సందేహం తీరలేదు.

''నిజంగానే!'' అంది వాణి.

''కనీసం చిన్న చిన్న దెబ్బలు తగలవూ? మళ్ళీ ప్రశ్నించాడు ప్రేమనాథ్.

''తగలవు!'' అంది మందహాసం చేస్తూ వాణి.

''నమ్మోచ్చా?'' సందేహం తీరలేదు ప్రేమ నాథ్ కి.

''నమ్మోచ్చు!'' అంది వాణి.

''అయితే దూకేస్తాను'' అన్నాడు కళ్ళు మూసుకుంటూ ప్రేమనాథ్.

''ఆలస్యం ఎందుకు! దూకేయండి! నా మాట మీద నమ్మకం ఉంటేనే'' అంది వాణి.

దూకేశాడు. నిజంగా రెండు అంతస్తుల మంచి కిందికి దూకేశాడ ప్రేమనాథ్.

అంతపని చేస్తాడని అనుకోలేదు వాణి.

గాబరాగా కిందికి వెళ్ళింది.

కాళ్ళు విరగలేదు. చేతులు విరగలేదు. తల పగలలేదు. నడుమూ విరగలేదు. అసలు ఏమీ విరగలేదు. కిందకి పడుతుండగా అక్కడ చెట్టు కొమ్మలు దొరికితే, వాటిని పట్టుకుని కిందికి పడటం వలన వేగం తగ్గి, ఇసక మూటలా కింద పడ్డాడు. కళ్ళు గిర్రున తిరిగాయి. మోచెయ్యి మీద, చెట్టు కొమ్మలు రాసుకుని, చర్మం చిట్లింది. అంతే!

''ఏమీ విరగలేదు. కనీసం చిన్న చిన్న దెబ్బలూ తగల్లేదు!'' అన్నాడు ప్రేమనాథ్, వాణిని చూస్తూ.

''అది మీ అదృష్టం! కనీసం ఒక కాలు, ఒక చెయ్యి విరిగి ఉంటాయనుకున్నాను. నిజంగా విరగాల్సిందే!'' అంది వాణి.

''అదేమిటి?'' ఆశ్చర్యంగా అడిగాడు ప్రేమ నాథ్.

''అవును. అంత ఎత్తునుండి దూకితే, విరగక పోవటం ఉంటుందా? విరగక పోవటమే పెద్ద ఆశ్చర్యం!'' అంది వాణి.

''మరి నన్నెందుకు దూకమన్నారు. నా కాళ్ళు చేతులు విరగ్గొట్టాకోమనేగా?'' ఆశ్చర్యపోతూ అడిగాడు ప్రేమనాథ్.

''అని కాదు— వ్యాపారస్తుల కుటుంబం అన్నారు కదా? దానిలో నిజానిజాలు తెలుసుకోవా లని ఈ పరీక్ష పెట్టాను!'' అంది వాణి.

''అర్ధమేమి కాలేదు— అయ్యేలా చెప్పండి!''

''వ్యాపారస్థులు ఎవరూ ఎప్పుడూ ఎదుటి వాళ్ళ మాటలు నమ్మరు! తమ బుద్ధిని మరువరు. కాని మీరు ఆ పని చేశారు. నా మాట నమ్మి దూకేశారు. కాలం బాగుండి ప్రమాదాన్ని తప్పించు కున్నారు. అందుకే నేను మిమ్మల్ని వ్యాపార కుటుంబీకుడిగా నమ్మటం లేదు. మీరు వట్టి అబద్దాల కోరు. మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకులేను'' అంది వాణి చకచక వెళ్ళిపోతూ.

అయోమయంగా మాసాడు బిజినెస్ మాగ్నెట్ పుత్రుడు ప్రేమనాథ్.

●

మహిళ... ఓ మహిళా

# స్త్రీజాతికి స్వతంత్రం ఎప్పుడు?

ఆడది మగాడి చేత ప్రేమించడం ప్రేమించబడటం ఆ తరువాత మోసగించబడటం ఇది అనాదిగా భారత స్త్రీకి జరుగుతున్న ఆచారం. స్త్రీ మోసపోవడం అనేది అనేక రూపాల్లో జరుగుతోంది! ఈ కలియుగంలో స్త్రీ రెండు విధలుగా మోసపోతూంది.

మొదటిది ప్రేమ వలన రెండవది పెళ్ళి వలన. ఈనాడు పెళ్లి చెయ్యాలి అమ్మాయికి అంటే, అబ్బాయికి భార్యను పోషించే శక్తి వుంటే చాలు పిల్ల నిచ్చి పెళ్లి చేస్తున్నారు! ఆ అబ్బాయ్ పూర్వ పరాలతో సంభంధమే లేకుండా పోతోంది! పెళ్లి కుమారుడు ఎమో పెళ్లైన తరువాత శ్రీరామ చంద్రుడు కాదనీ శ్రీ కృష్ణపరమాత్ముడనీ, అంతేగాక ఇచ్చిన కట్నం చాల్లేదనీ ఆ పెళ్లాన్ని తన్ని తగలేసి పుట్టింటికి పంపుతున్నాడు ఆ తరువాత దర్జాగ రెండో పెళ్లి చేస్కుంటున్నాడు!

ప్రేమించిన ప్రియుడు ప్రియురాలి అవసరం తీరిపోగానే ఛీపో... అంటున్నాడు! ఎందుకు అంటే వాడి కాళ్ల మీద పడి ఏడ్చి మొత్తుకుని ''మీ పాదల దగ్గర రవ్వంత చోటివ్వండి నా మెడలో తాళికట్టించుకుని మీ భార్య అని పించుకుంటే చాలు అంతకు మించి మీ నుండి ఇంకేమీ కోరను!'' ఆ తరువాత అంతే మీ ఇష్టం అని ప్రాధేయపడుతోంది అప్పటికి పెళ్లి కొడుకు వినకపోతే ''మౌనపోరాటం'' లేదంటే ఏదో ఒకటి ''పాయిజాన్ త్రాగి ఆత్మహత్య'' చేసుకోవడం ఇదోక ఫ్యాషనైపోయింది!

రోజులు మారాయి, కానీ స్త్రీ మాత్రము ఎంతో వెనక బడి వుంది! పరిస్థితుల కనుగుణంగా స్త్రీలలో మార్పు మాత్రం ఇంతవరకూ రాలేదు ఇలా ఎంత కాలం స్త్రీ ముందుకు ధైర్యంగా రావాలి ప్రతి విషయంలోను మగాడితో సమానంగా పోటీ పడాలి! హిమాలయా పర్వతాల్ని అధిరోహించాలి! అంతః రిక్షంలోకి దూసుకుపోవాలీ కానీ పాపం శారీరకంగా మోగాలలో ఎగిరినా మానసికంగా ఆ వూరి పొలి మేరలు కూడా దాటలేకపోతోంది అలా కాదనీ నిరూపించాలి ఈనాటి స్త్రీ!

వి. వసంత
సూళ్లూరు పేట.